# శివోహం

- శైవక్షేత్రాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- జాగరణ పూజలకు పోటెత్తిన భక్తజనం



కపాలేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో కర్పగాంబాళ్ సమేత కపాలేశ్వరుడు

ప్యారీస్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆదిదేవుడైన మహాశివుడికి ఇష్టమైన 'మహాశివరాత్రి' పర్వదినం సందర్భంగా బుధవారం రాష్ట్రంలోని శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. 'హర హర మహాదేవ.. శంభో శంకర..' అంటూ శివ నామస్మరణతో శివాలయాలు మార్మోగిపోయాయి. సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన శైవక్షేత్రాలు అశేష భక్తజనంతో కిటకిటలాడాయి. ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో లింగోద్భవాల మహన్యాస పూర్వఏకాదశ రుద్రాభిషేకం, మహా అర్చన, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలం, పన్నీరు, పండ్లు, గంధం, వెన్న, నెయ్యి, సుగంధద్రవ్యాలతో ఉత్సవ మూర్తులను విశేషంగా అభిషేకించి అలంకార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా రోజంతా ఉపవాస దీక్షలు చేపట్టి జాగరణలో పాల్గొని దైవ దర్శనం చేసుకోవడం వల్ల సకల పాపాలు తొలుగుతాయన్న నమ్మకంతో భక్తులు బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన శివాలయాలకు తరలివెళ్లారు. గురువారం నాలుగు జాముపూజలు ముగించుకుని అనంతరం పుణ్యస్నానమాచరించి ఆహారం తీసుకుని ఉపవాసదీక్షను విరమించనున్నారు.

### మదురైలో...

ఎంతో చరిత్రగాంచిన మదురై దివ్యక్షేత్రంలోని మీనాక్షి అమ్మవారి ఆలయంలో రాత్రి 10గంటల నుంచి ప్రారంభమైన భక్తిసంగీత విభరి, భజన, ఆధ్యాత్మిక ప్రముఖుల ప్రవచనాలు, భరతనాట్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

### అగ్ని క్షేత్రంలో

పంచభూతాలలో అగ్నిక్షేత్రంగా విరాజిల్లుతున్న తిరువణ్ణామలై క్షేత్రం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. ఉన్నామలై సమేత అరుణాచలేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ మహామండపంలో కొలుదీర్చారు. జాగరణకు వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయం ముందు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో బారులు తీరి తెల్లవార్లు వేచివుండి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. తంజావూర్ జిల్లాలో కుంభకోణం సమీపంలోవున్న తిరునల్లూరు క్షేత్రంలో కొలువైన పంచవర్ణేశ్వరాలయంలో భక్తులను కటాక్షిస్తున్న పురాతన కాలంనాటి శివలింగానికి అభిషేకపూజలు నిర్వహించారు.

### బృహదీశ్వరాలయంలో...

తంజావూర్‌లో శతాబ్దాల చరిత్ర కలిగిన బృహదీశ్వరాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని 12గంటల పూజలు నిర్వహించారు. మహానందిని రకరకాల పూలు, పండ్లు, పత్రాలతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కడలూరు జిల్లా పెన్నాడంలోని ఆమోదానాంబిక సమేత ప్రళయకాళేశ్వరర్ ఆలయంలో ఉన్న భారీ శివలింగాన్ని పుష్పాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. తిరునల్వేలి నెల్లయప్ప ఆలయం, తిరువానై కావల్ జంబుకేశ్వరాలయం, తిరువారూర్ త్యాగరాజస్వామి ఆలయం, తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయం, తిరువలంగాడు వడరణ్యేశ్వరాలయం, స్థానిక వడపళనిలోని మురుగన్ ఆలయం, మైలాపూర్ కపాలేశ్వరాలయం, తంగసాలైలోని ఏకాంబరేశ్వరాలయం, ప్యారీస్ కందస్వామి ఆలయం, టి.నగర్ శివావిష్ణు ఆలయం, కుండ్రత్తూరు కుమరన్ ఆలయం, తిరుముల్లైవాయల్ మాసిల మణీశ్వరాలయయం సహా పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. శివరాత్రి పూజల్లో పాల్గొన్న భక్తులకు రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు, దక్షిణ రైల్వేశాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులు, రైళ్లు నడిపాయి. ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా పోలీసులు భద్రతా విధులు నిర్వహించారు.


## 'ఈషా' వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



అమిత్‌షాను ఆశీర్వదిస్తున్న జగ్గీవాసుదేవ్





లింగాకార పరమాత్ముడికి జగద్గురు పూజలు

కోయంబత్తూర్ ఈషా యోగా కేంద్రంలో మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కోయంబత్తూర్‌కు వచ్చిన అమిత్ షా, సద్గురు జగ్గీవాసుదేవన్ నేతృత్వంలోని ఈషా కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ఈషా కేంద్రంలో మహాశివరాత్రి వేడుకలు చూస్తుంటే కుంభమేళాలో ఉన్నట్లు ఉందన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ఓ చిన్నారితో జెండా ఆవిష్కరిస్తున్న విజయ్

# అసెంబ్లీ ఎన్నికల్లో సరికొత్త చరిత్ర సృష్టిద్దాం

- 1967, 1977 పరిస్థితులు పునరావృతం తథ్యం
- టీవీకే వార్షికోత్సవ సభలో విజయ్ శపథం



వేదికపై విజయ్

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 1967, 1977సంవత్సరాల్లో రాష్ట్రంలో చోటుచేసుకున్న విప్లవాత్మక మార్పులు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతం కావడం తథ్యమని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ ధీమా వ్యక్తం చేశారు. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలోని పూంజేరి వద్దనున్న ఓ స్టార్‌హోటల్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ.. 'రాజకీయాలంటేనే వేరే లెవల్. ఎవరు ఏ సమయంలో వ్యతిరేకిస్తారో, ఏ సమయంలో మద్దతిస్తారో ఎవరికీ అంతుచిక్కదు. అందుకే రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు లేరని చెబుతుంటారు' అని పేర్కొన్నారు. ఓ వైపు రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చని చెబుతూనే మరో వైపు కాస్త ప్రజాదరణ కలిగిన వ్యక్తులు ఎవరైనా వస్తే కొందరికి కోపం తలకెక్కుతోందన్నారు. హఠాత్తుగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి తమ అవినీతి బండారం బయటపెడతాడేమోనని భయపడుతున్నారని డీఎంకేని పరోక్షంగా విమర్శించారు. తమ గుట్టు బయటపడకుండా ఉండాలంటే పార్టీ ప్రారంభించిన వాడిని తిట్టడమే మంచిదనుకుని వీడికెందుకు రాజకీయాలు అంటూ ఎద్దేవా చేయడం ప్రారంభించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు కూడా ఈ రీతిలోనే విమర్శిస్తున్నారన్నారు.

### ఏడాదిపాటు సమర్థవంతంగా...

ఇలాంటి పరిస్థితుల్లో పార్టీని యేడాదిపాటు సమర్థవంతంగా నడిపించడం కూడా రికార్డేనన్నారు. పార్టీకి అండగా నిలిచినవారందరికీ ధన్యవాదాలు చెప్పారు. పార్టీని మర్రిచెట్టులా పెంచాల్సిన అవసరం ఉందని, ఆ దిశగానే తాను పార్టీ కార్యవర్గాల ఏర్పాటులో తలమునకలయ్యానని చెప్పారు. త్వరలో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తానన్నారు.

### గెలిపించేది యువతే...

పార్టీలో యువకులే అధికంగా ఉన్నారంటూ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారని, అన్నాదురై పార్టీని ప్రారంభించినప్పుడు, ఎంజీఆర్ పార్టీని ప్రారంభించినప్పుడు వారికి అండగా నిలిచి గెలిపించింది యువకులేననే విషయం మరువకూడదన్నారు. ఆ దిశగా టీవీకే కూడా యువత అందించే గట్టి మద్దతుతో అధికారంలోకి వస్తుందని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ధన సంపాదనపై దృష్టి సారిస్తున్న రాజకీయ పెత్తందార్లను తరిమికొట్టడమే తన పార్టీ ప్రధాన కర్తవ్యమన్నారు.

### డీఎంకే కూటమిలో చీలికలు...

ఈ సభలో పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ సమన్వయకర్త ఆదవ్ అర్జునా మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలోపే డీఎంకే కూటమిలో చీలికలు ఏర్పడతాయని, ఎన్నికల్లో టీవీకే గెలిచి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం, విజయ్‌ని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టే దిశగా తీవ్రంగా పాటుపడటమే తన లక్ష్యమన్నారు.

### విజయ్‌కి అండగా...

ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ అవినీతిలో కూరుకుపోయిన డీఎంకే ప్రభుత్వానికి విజయ్ పార్టీ చరమగీతం పాడటం ఖాయమని, ఆయనకు రాజకీయ వ్యూహరచన చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. విజయ్‌కి అండగా ఉండటమే తన ఆశయమని అన్నారు. ఇదిలా వుండగా ఈ వేడుకలకు హాజరైన మూడువేల మందికి రుచికరమైన శాఖాహార, మాంసాహార భోజనాలను వడ్డించారు. ఈ వేడుకలకు వచ్చిన నేతల వాహనాల రాకపోకల కారణంగా ఈసీఆర్ రోడ్డులో బుధవారం ఉదయం 10 నుండి 11 గంటల దాకా ట్రాఫిక్ స్తంభించింది.

# డీఎంకే అవినీతికి అడ్డుకట్ట

- రాష్ట్రంలో ఉగ్రవాద సంస్థలను పెకలించాల్సిందే
- ఇవన్నీ జరగాలంటే రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అవసరం
- కోయంబత్తూరులో అమిత్‌షా



అమిత్‌షాను సత్కరిస్తున్న పార్టీ నేతలు


చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, ఇక్కడ స్థావరాలు ఏర్పరచుకున్న ఉగ్రవాద సంస్థలను కూకటి వేళ్లతో పెకలించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఇవన్నీ జరగాలంటే రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం రావాల్సిన అవసరముందన్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి కోయంబత్తూరు చేరుకున్న అమిత్‌షా బుధవారం ఉదయం పీలమేడు ఎల్లై గార్డెన్ లో కొత్తగా నిర్మించిన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. తిరువణ్ణామలై, రామనాథపురం జిల్లాలోని పార్టీ స్థానిక శాఖ కార్యాలయాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో అమిత్‌షా మాట్లాడుతూ... కోయంబత్తూరు ప్రజలకు, తమిళ ప్రజలందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ప్రారంభించినవి పార్టీ కార్యాలయాలు కావని, స్థానిక ప్రజలకు సేవలందించే ఆలయాలని అభివర్ణించారు. అత్యంత ప్రాచీనమైన తమిళభాషలో మాట్లాడలేకపోతున్నానని, అందుకు తనను క్షమించాలని కోరారు. కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా ఉందని, కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఒడిశాల్లో కూటమి ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. 2025 ఆరంభమే దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని, ఆ కోవలోనే 2026లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం తమిళనాట అధికారంలోకి వచ్చితీరుతుందని అమిత్‌షా శపథం చేశారు.

### తమిళనాట శాంతిభద్రతలు అధ్వానం

శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని, ఈ రాష్ట్రంలో విశ్వవిద్యాలయం వంటి కీలకమైన ప్రాంతాల్లోనే మహిళలకు భద్రత కరువైందని అమిత్‌షా ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి వెళ్లిన యువతులు తిరిగొచ్చే పరిస్థితులు ఇక్కడ లేవన్నారు. వేంగైవయల్ ఘటన జరిగిన 700 రోజులు గడిచినా నిందితులను పట్టుకోలేకపోతున్నారని, సారా ఏరులై పారుతోందన్నారు. కల్తీసారా వ్యాపారులను విడిచిపెట్టి, ఆ వ్యాపారుల సమాచారం అందించిన వారిని అరెస్టు చేసిన ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 1998లో కోయంబత్తూరులో జరిగిన బాంబు పేలుడు కేసుకు సంబంధించి ఇంకా దోషులను అరెస్టు చేయకపోవడం కూడా శోచనీయమన్నారు. అవినీతిలో డీఎంకే నేతలందరికీ మాస్టర్ డిగ్రీలు ప్రదానం చేయవచ్చన్నారు. తమ అవినీతి బండారం ఎక్కడ బయపడుతుందోననే భయంతో ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన తనయుడు ఉదయనిధి రోజుకో అసత్య ప్రచారం సాగిస్తున్నారని చెప్పారు. తాజాగా నియోజకవర్గాల పునర్విభజన పేరుతో రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గించనున్నట్లు అసత్యమాడుతున్నారని అన్నారు. స్టాలిన్‌కు తాను సుస్పష్టంగా చెబుతున్నానని, తమిళనాటే కాదు దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ ఎంపీల సంఖ్యను తగ్గించే ప్రసక్తేలేదన్నారు. ఈ సభలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఎమ్మెల్యేలు వానతి శ్రీనివాసన్, నయినార్ నాగేంద్రన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# రూ.5వేల కోట్లతో 50 వేల మందికి ఉపాధి

- తోలురహిత పాదరక్షల తయారీ ఫ్యాక్టరీలు
- సీఎం స్టాలిన్ సమక్షంలో ఎవర్వాన్ కొథారి ఒప్పందం



ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న ఎవర్వాన్ కొథారి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కరూరు, పెరంబలూరు జిల్లాల్లో రూ.5వేల కోట్ల పెట్టుబడితో తోలురహిత పాదరక్షల తయారీ కర్మాగారాలను నెలకొల్పేందుకు ఫినిక్స్ కొథారీ గ్రూపునకు చెందిన ఎవర్వాన్ కొథారి సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో బుధవారం ఉదయం పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రెండు జిల్లాల్లో సుమారు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఎవర్వాన్ కొథారి ఫుట్‌వేర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రఫీక్ అహ్మద్, రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఎండీ తారీఫ్ అహ్మద్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న కరూరు, పెరంబలూరు జిల్లాల్లో ఈ కొత్త కర్మాగారాలు నెలకొల్పనుండటం తనకెంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ రెండు కర్మాగారాలు ఏర్పాటైతే యువకులు, ప్రత్యేకించి మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య మండలి శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, ఎవర్వాన్ షూటవున్ గ్రూపు చైర్మన్ రాన్, కార్యాచరణ ఉపాధ్యక్షుడు పి.కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార దర్శిని

### మళ్లీ నాగై-శ్రీలంక ప్రయాణికుల నౌకా సేవలు రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నాగై-శ్రీలంక మధ్య నడుపుతున్న ప్రయాణికుల నౌకా సేవలు మళ్లీ రద్దయ్యాయి. నాగపట్టినం హార్బర్ నుంచి శ్రీలంకలోని కాంగేశన్ హార్బర్‌కు ప్రయాణికుల నౌకా సేవలు అందుబాటులో ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా గత ఏడాది నవంబరు 18వ తేది నుంచి ఈ సేవలు నిలిపివేశారు. ఈ క్రమంలో, ఈనెల 22వ తేది మళ్లీ నౌకా సేవలు ప్రారంభించారు. తాజాగా రాష్ట్రంలో ఈనెల 28వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షాలు కురిశాయి.ఈ కారణంగా బంగాళాఖాతంలో బలమైన గాలులు వీస్తున్నాయి. గాలుల కారణంగా నౌక నడపలేని పరిస్థితులు నెలకొన్నాయి. అందువల్ల ఈనెల 28వ తేది వరకు నౌకా సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. మార్చి 1వ తేది నుంచి యథావిధిగా నౌక సేవలుంటాయని నౌక సంస్థ అధికారులు తెలిపారు.

### విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి రోజైన జూన్ 3వ తేది 'సెమ్మొళి రోజు'గా నిర్వహించనున్నట్లు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయి పోటీలు మే 9, కళాశాల స్థాయి పోటీలు మే 10వ తేది నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి పోటీల విజేతలకు రూ.10,000, రూ.7,000, రూ.5,000, రాష్ట్రస్థాయి విజేతలకు రూ.15,000, రూ.10,000, రూ.7,000 అందించనున్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులకు మే 17వ తేది చెన్నైలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ జిల్లాల్లోని తమిళ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కార్యాలయంలో మార్చి 25వ తేదీలోపు ప్రధానోపాధ్యాయుడు సిఫారసు లేఖతో పేరు నమోదుచేసుకోవాలని తమిళ అభివృద్ధి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

### వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఈనెల 28 నుంచి మే 2వ తేది వరకు 627 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. 28వ తేది శుక్రవారం, మే 1 శనివారం, మే 2వ తేది ఆదివారం కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక కీలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, ఈరోడ్, సేలం తదితర ప్రాంతాలకు ఈనెల 28వ తేది 245 బస్సులు, మే 1వ తేది 240 బస్సులు నడపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఈనెల 28, మే 1వ తేదీల్లో తలా 51 ప్రత్యేక బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి ఈనెల 28, మే 1వ తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

### నేటి నుంచి వీరరాఘవ పెరుమాళ్ తెప్పోత్సవం

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్‌లో ఉన్న వైద్య వీరరాఘవ పెరుమాళ్ ఆలయ మాసి నెల తెప్పోత్సవం గురువారం ప్రారంభమై మూడు రోజులు జరగనుంది. ఈ మూడు రోజుల్లో ప్రతిరోజు ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వైద్య వీరరాఘవ పెరుమాళ్ కొలను వద్దకు చేరుకుంటారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించి, విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన తెప్పలో అధిష్టింపజేసి చేసి కొలను చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి భక్తులకు దర్శనమివ్వనున్నారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌లో అత్యాచారం

● ఇన్‌స్పెక్టర్ సహా ముగ్గురికి పదేళ్ల జైలుశిక్ష

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో అత్యాచారం చేసిన కేసులో పదవీ విరమణ పొందిన పోలీసు ఇన్‌స్పెక్టర్ సహా ఇద్దరు కానిస్టేబుళ్లకు తలా 10 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దిండుగల్ జిల్లా సెంపట్టిలో 2001లో చోరీ కేసులో విచారణకు తీసుకొచ్చిన మహిళను, ఆమె భర్త కళ్లెదుటే అత్యాచారం చేశారంటూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి(77), కానిస్టేబుళ్లు వీరదేవర్ (68), చిన్న దేవర్ (69)పై కేసు నమోదు చేశారు. ఈ ఘటన తర్వాత బాధిత మహిళ బావిలో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, గ్రామస్తులు రక్షించారు. కొద్దిరోజుల అనంతరం ఆమె భర్త శక్తివేల్ విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ విచారణ చేపట్టి కోర్టులో నివేదిక దాఖలు చేశారు. కేసు విచారణ సుదీర్ఘంగా 24 ఏళ్లు సాగిన నేపథ్యంలో, ఇన్‌స్పెక్టర్ రంగస్వామి, కానిస్టేబుళ్లు వీరదేవర్, చిన్న దేవర్‌కు తలా 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.36,000 జరిమానా విధిస్తూ దిండుగల్ ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి దీప మంగళవారం తీర్పు వెలువరించింది.

## పాఠశాలలో స్పృహతప్పి విద్యార్థి మృతి



కవిన్‌రాజ్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురంలో ఉన్న పాఠశాలలో ఓ విద్యార్థి టాయిలెట్ స్పృహతప్పి పడిపోయి మృతి చెందాడు. రాశిపురం ఎల్ఐసీ కాలనీకి చెందిన పెయింటర్ ప్రకాష్ కుమారుడు కవిన్‌రాజ్ (14) రాదిపురం శివనంద రోడ్డు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం యథావిధిగా పాఠశాలకు వెళ్లిన కవిన్‌రాజ్, విరామ సమయంలో టాయిలెట్ వెళ్లి హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. ఉపాధ్యాయులు అతన్ని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న కవిన్‌రాజ్ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకొని, అనుమానాస్పదంగా మృతిచెందాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. రాశిపురం డీఎస్పీ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ ఎస్.సుఖవనం, తహసీల్దార్ ఎస్.శరవణన్ అక్కడికి చేరుకొని వారితో చర్చలు జరిపి శాంతింపజేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ద్వాదశ క్షేత్రాల్లో 'భక్తుల పరుగు' ప్రత్యేక పూజలు



శివాలయాలకు పరుగెత్తటానికి సిద్ధమవుతున్న భక్తులు - పరుగు కార్యక్రమంలో పాల్గొన్న కేరళ భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకుని ద్వాదశ క్షేత్రాల్లో భక్తుల పరుగు కార్యక్రమం నిర్వహించారు. మూంజిరై తిరుమలై మహాదేవర్ ఆలయం నుంచి భక్తులు బుధవారం ఉదయం ఈ పరుగును ప్రారంభించారు. తిక్కురుచ్చి మహాదేవర్ ఆలయం, తిరపరప్పు వీరభద్రాలయం, తిరునందిక్కరై నందీశ్వరాలయం, పొన్‌మనై తీప్పిలాన్‌కుడి మహాదేవర్ ఆలయం, కల్‌కుళం నీలకంఠస్వామి ఆలయం, మేలంగాడు మహాదేవర్ ఆలయం, తిరువిడైకోడు మహాదేవర్ ఆలయం, తిరువిదాంగోడు మహాదేవర్ ఆలయం, తిరుపన్నియోడు మహాదేవర్ ఆలయం, నట్టాలమ్ శంకరనారాయణ ఆలయం, పన్నిపాక్కం ఆలయాలకు భక్తులు పరుగులు తీశారు. ఆయా ఆలయాల్లో దైవదర్శనం చేసుకున్నారు. యేటా మహాశివరాత్రి మొత్తం 110 కిలోమీటర్ల దూరం వరకూ శివభక్తులు వ్రతమాచరించి భక్తిశ్రద్ధలతో ఈ శివాలయాలకు పరుగులు తీసే కార్యక్రమంలో పాల్గొనటం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేరళ నుంచి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పరమేశ్వరుడిని కీర్తించే భక్తి గీతాలను పాడుకుంటూ, అష్టాక్షరీ మంత్రాన్ని పఠిస్తూ భక్తులు ఈ పరుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం రాత్రి ఈ పన్నెండు శివాలయాల్లో భక్తుల రద్దీ అధికమైంది. ఈ భక్తులంతా రాత్రంతా ఆలయాలలోనే బసచేసి ప్రత్యేక పూజలను, ఆరాధనలను వీక్షిస్తూ జాగరణ చేశారు.

# అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

### కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటర్ల ప్రయోజనం కోసం ఎన్నికల సంఘం పనిచేస్తుందని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ తెలిపారు. ఇటీవల 26వ భారత ఎన్నికల ప్రధాన అధికారిగా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేష్‌కుమార్ బుధవారం మదురైకి వచ్చారు. మదురై ప్రభుత్వ అతిథిగృహంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మదురైలో ఎన్నికల పనులకు సంబంధించి అధికారులతో సమీక్ష జరిపామన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకోసం ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల ప్రయోజనాల కోసం పనిచేస్తుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్, మదురై కలెక్టర్ సంగీత, కార్పొరేషన్ కమిషనర్ చిత్ర విజయన్, నగర పోలీసు కమిషనర్ లోకనాథన్, జిల్లా ఎస్పీ అరవింద్ తదితరులున్నారు. అనంతరం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ తన కుటుంబంతో కలసి మీనాక్షి అమ్మవారి ఆలయం వెళ్లారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మీనాక్షి అమ్మవారి సన్నిధి, సుందరేశ్వరర్ సన్నిధికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసిన ఆయన, పొత్రామరై కొలను వద్ద కుటుంబసభ్యులతో ఫొటో తీసుకున్నారు. అనంతరం ఆయన రామేశ్వరం బయల్దేరి వెళ్లారు.

# ప్రభుత్వ బస్సు, కారు ఢీ

### ఇద్దరు మహిళలు సహా ఐదుగురి మృతి



పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా కుళిత్తలై సమీపంలో ప్రభుత్వ బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మృతిచెందారు. కోయంబత్తూర్ జిల్లా కునియమూర్తి గాంధీనగర్ సుగుణాథపురానికి చెందిన సెల్వరాజ్ (52) కుటుంబంతో కలిసి తంజావూరు జిల్లా ఒరత్తనాడు కీళయూర్ ప్రాంతంలోని కులదైవం అగ్నివీరనార్ ఆలయానికి మంగళవారం రాత్రి కారులో బయల్దేరాడు. కారును ఈరోడ్ జిల్లా విల్లరసంపట్టికి చెందిన విష్ణు (24) నడుపుతున్నాడు. కారు కరూర్ జిల్లా కుళిత్తలై కరూర్-తిరుచ్చి జాతీయ రహదారి సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల వద్దకు వస్తున్న సమయంలో ఎదురుగా ఆరంతాంగి నుంచి తిరుప్పూర్ వైపుకు వెళుతున్న ప్రభుత్వ బస్సును ఊహించని విధంగా ఢీకొంది. ఈ ఘటనలో సెల్వరాజ్, ఆయన భార్య కలైఅరసి, కుమార్తె అహల్య, కుమారుడు అరుణ్, కారు డ్రైవర్ విష్ణు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. బస్సులో ప్రయాణిస్తున్న వారు ఎలాంటి గాయలు లేకుండా తప్పించుకున్నారు. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న కుళిత్తలై పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలాన్ని కలెక్టర్ ఎం.తంగవేల్, ఎస్పీ అబ్దుల్లా పరిశీలించారు.

### ముగ్గురు పాదచార భక్తులు...

రామనత్తంలో పాదయాత్రగా వెళ్తున్న భక్తులపై కారు దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు. కడలూరు జిల్లా వేప్పూర్ సమీపం జవదుకుడికి చెందిన కార్తికేయన్(18), కాశివేల్(20), బాలు(28) సమయపురం మారియమ్మన్ ఆలయానికి మంగళవారం ఉదయం పాదయాత్రగా బయల్దేరారు. సాయంత్రం 4 గంటలకు చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో రామనత్తం సమీపంలో వెళ్తున్న వారిని వెనుకగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కార్తికేయన్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. గాయపడిన కాశివేల్, బాలును 108 అంబులెన్స్‌లో పెరంబలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతి చెందారు. ఈ ఘటనపై రామనత్తం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇక టీవీకేతోనే నా రాజకీయ పయనం

● రంజనా నాచ్చియార్



చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి రంజనా నాచ్చియార్ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంలో చేరుతున్నట్లు ప్రకటించారు. మంగళవారం బీజేపీకి గుడ్‌బై చెప్పిన రంజనా గురువారం టీవీకే వార్షికోత్సవాల్లో ప్రత్యక్షమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... భారతీయ భాషలకు ఎవరూ వ్యతిరేకులు కారని, అదే సమయంలో ఓ భాషను నిర్బంధంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తేనే తమిళులు వ్యతిరేకిస్తారని చెప్పారు. రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానానికి తావులేదన్నారు. ఇక రాష్ట్ర ప్రజలకు టీవీకే మంచి భవిష్యత్తును అందజేస్తుందని, ఆ దిశగా పార్టీ అభివృద్ధికోసం పాటుపడేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె చెప్పారు.

## డీఎంకే శ్రేణుల అత్యుత్సాహం

● ఆంగ్ల అక్షరాలకు తారు పూత



ఆంగ్లంలో ఉన్న స్టేషన్ పేరుపై తారు పూస్తున్న డీఎంకే నేత

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని కడయనల్లూరు వద్ద డీఎంకే స్థానిక శాఖ నాయకులు హిందీ వ్యతిరేక ఆందోళనలో భాగం అక్కడి రైల్వేస్టేషన్ వద్దనున్న నేమ్‌బోర్డుపై హిందీలో ఉన్న స్టేషన్ పేరుపై తారు పూయాలని వెళ్ళారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుకు, నిర్బంధ హిందీ వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ స్టేషన్‌లోకి వెళ్లారు. ప్లాట్‌ఫాం వద్దకు వెళ్ళి అక్కడే ఉన్న మూడు భాషలతో స్టేషన్‌పేర్లున్న గోడవద్దకు చేరుకున్నారు. పార్టీ నాయకుడొకరు చిన్న నిచ్చెన వేసుకుని పైకి ఎక్కి డబ్బాలోని తారునూ హిందీ అక్షరాలపై పూయడానికి బదులు హిందీలో స్టేషన్ పేరుకు దిగువ ఉన్న ఆంగ్ల అక్షరాలపై తారు పూశారు. ఆ దృశ్యాన్ని చూసి కార్యకర్తలు దిగ్భ్రాంతి చెంది, ఇంగ్లీషు అక్షరాలపై తారు పూశావంటూ ఆ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన తప్పు తెలియటంతో ఆ నాయకుడు నాలుక్కరచుకుని హిందీ అక్షరాలపై తారు పూశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఆంగ్ల అక్షరాలపై తారు పూస్తున్న దృశ్యం కలిగిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.

## నటులు రాజకీయాల్లో ఏదీ సాధించలేరు

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ వ్యాఖ్య

ప్యారీస్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సినీ నటులు పలువురు రాజకీయాల్లోకి వచ్చినా వారు చెప్పుకోదగ్గ రీతిలో ఏదీ సాధించలేదని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. ఆయన బుధవారం తిరువణ్ణామలైలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల అనంతరం మీడియాతో మాట్లాడారు. నటుడు విజయ్ తమిళగ వెట్రి కళగం అనే పార్టీని స్థాపించారని రాజకీయాల్లో ఆయన బలమేంటో ఎన్నికల తర్వాతే స్పష్టమవుతుందన్నారు. సినీ పరిశ్రమలో విశేష అనుభవం కలిగి రాజకీయాల్లోకి వచ్చిన దివంగత మాజీ ముఖ్యమంత్రులు కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత ప్రస్తుతం మన మధ్య లేని పరిస్థితుల్లో, డీఎంకే, అన్నాడీఎంకేలను బలహీన పరచవచ్చని కొంతమంది కలలుకంటున్నారన్నారు. సినిమాలో సాధించిన విజయాలను ముందుంచి రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకుంటున్న వారి ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించబోవన్నారు. ప్రజలు రాజకీయాల గురించి మంచి అవగాహన కలిగివున్నారని, ముఖ్యంగా యువకులు రాజకీయాలను శాసించగలిగే శక్తులుగా మారారన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన జాతీయ విద్యావిధానానికి తమ పార్టీ వ్యతిరేకమని, మార్చి 5న ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో జరగనున్న అఖిలపక్ష సమావేశంలో జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ కీలక తీర్మానం చేసే అవకాశముందని ఆయన తెలిపారు.

## మూడో రోజుకు చేరిన జాలర్ల సమ్మె



రామేశ్వరం ఫిషింగ్ హార్బర్‌లో పడవలు

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం జాలర్లు చేపట్టిన సమ్మె మూడవ రోజైన బుధవారం కొనసాగింది. రామేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన జాలర్లు గత వారం చేపల వేటకు వెళ్లిన సమయంలో వారిని చుట్టుముట్టిన లంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ 42 మంది జాలర్లు, 5 పడవలు స్వాధీనం చేసుకుంది. రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు అధికమయ్యాయని, ఈ దాడులు అడ్డుకొనేలా చర్యలు చేపట్టడంతో పాటు శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రామేశ్వరం జాలర్లు ఈ నెల 24వ తేది నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో, సుమారు 5,000లకు పైగా పడవలు తీరంలోనే నిలిచిపోయాయి. జాలర్ల సమ్మెతో రోజుకు రూ.కోటి వరకు నష్టం ఏర్పడుతుందని వ్యాపారులు వాపోతున్నారు.

## ఎలుగుబంటి దాడిలో ఇద్దరి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కోవిల్‌పారై సమీపంలో ఎలుగుబంటి దారిలో ఇద్దరు మృతిచెందారు. తేని జిల్లా వరుషనాడు సమీపం తంగమ్మాళ్‌పురానికి చెందిన మణి అలియాస్ మణికంఠన్(45), ధర్మరాజపురానికి చెందిన కరుప్పయ్య (55)కు వివాహమై, ఇద్దరి భార్యలు మృతిచెందిన తరుణంలో, కోవిల్‌పారై సమీపంలోని తోటలో ఉంటూ వ్యవసాయం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో స్వల్పంగా వర్షం కురుస్తున్న సమయంలో, మణికంఠన్ తోటలో ఇద్దరు నిమ్మకాయలు కోసే పనులు పూర్తిచేసి, కొంత దూరంలో ఉన్న ద్విచక్రవాహనం వద్దకు నడుచుకుంటు వస్తున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా ఆ ప్రాంతానికి వచ్చిన ఎలుగుబంటి ఇద్దరిపై దాడి చేయడంతో, తీవ్రగాయాలతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై కండమనూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## డీఎంకే విద్యార్థి విభాగం ధర్నా



తిరుత్తణి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విధానాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. తిరువళ్లూర్ వెస్ట్ జిల్లా కన్వీనర్ మురళిసేన నేతృత్వంలో స్థానిక కమల థియేటర్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రాంతీయ మాతృభాషలను కనుమరుగు చేసి హిందీ భాష నిర్బంధించేలా కొత్త విద్యావిధానం ఉందని, ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలుచేసేది లేదని, ద్విభాషా విధానమే కొనసాగుతుందని నేతలు తెలిపారు. ధర్నాలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు.

## నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరుకల్యాణం



తిరుకల్యాణంలో భక్తులు

ప్యారీస్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు వాటర్ కెనాల్ రోడ్డులో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి తిరుకల్యాణం నేత్రపర్వంగా సాగింది. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రాంగణంలో ఉదయం 6.30గంటలకు దైవదంపతులకు విశేష అభిషేకం, సహస్ర నామార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 1008 శివలింగాలకు రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు తిరుకల్యాణం క్రతువును ప్రారంభించిన అర్చకులు ముందుగా శాంతిహోమం, యజ్ఞోపవీత ధారణ, పాదప్రక్షాలన, కన్యాదానం, సారె, పట్టువస్త్రాల సమర్పణను భక్తుల దివ్యనామస్మరణ, వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య మాంగళ్యధారణ అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం 6గంటలకు శివయాగం, రాత్రి 8గంటల నుంచి తెల్లవారుజాము వరకు నాలుగు జాము పూజలను నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు తాతోలు వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, ట్రెజరర్ నూతక్కి కిషోర్, కె.సీతారామశర్మ, బి.ఎస్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించి కల్యాణంలో పాల్గొన్న భక్తులందరికి తీర్థప్రసాదాలు, ముత్తైదువులకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు.

## శివశక్తి సిద్ధేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు



స్వామివారి సేవలో సినీ ప్రముఖుడు రవిరాజు తదితరులు

తిరుత్తణి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కేజీ కండ్రిగై సెంజమ్మ కోనై కొండపై కొలువుదీరిన శివశక్తి సిద్ధేశ్వరాలయంలో శివరాత్రి పూజలను శివాచార్యుల వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 6గంటలకు స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం విశేష పుష్పాలంకారంలో పరమేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వీకేఆర్‌పురానికి చెందిన ప్రముఖ సినీ పరిశ్రమ నిర్వాహకుడు రవిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు సురేష్, రమేష్, సుబ్రాన్‌తో కలిసి భక్తులకు అన్నదానం చేశారు.

## నిరుపేద కళాకారులకు రూ.లక్ష సాయం



చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై సచివాలయంలో పర్యాటక, సంప్రదాయ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర సంగీత సాహిత్య నాటక సంస్థ (మంద్రం)తరఫున 'కలైమామణి' అవార్డులు పొందిన, ప్రస్తుతం పేదరికంలో ఉన్న 10 మంది కళాకారులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తలా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా తమిళంలో అరుదైన కళలపై పుస్తకాలు ప్రచురించిన ఐదుగురు రచయితలకు తలా రూ.2లక్షలు పంపిణీ చేశారు. కొత్త నాటకలను రూపొందించి ప్రదర్శించడానికి గాను ఐదుగురు నృత్య కళాకారులకు తలా రూ.1.50 లక్షల చొప్పున అందించారు. అదేవిధంగా 20 మంది దివంగత కళాకారుల వారసుల జీవన భృతికోసం తలా రూ.25 వేలని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమిళ భాషాభివృద్ధి సమచార శాఖ మంత్రి ఎంపీ సామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పర్యాటక, సంప్రదాయ దేవాదాయ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, కళల సంప్రదాయ శాఖ సంచాలకులు కవితా రాము, రాష్ట్ర సంగీత, నృత్య సాహిత్య మండలి అధ్యక్షుడు, ప్రముఖ సినీనటుడు వాగై చంద్రశేఖర్, మెంబర్ సెక్రటరీ విజయా తాయన్నన్ తదితరులు పాల్గొన్నారు.

## తమిళ భాషాభివృద్ధికి చేసిందేమిటి?

● డీఎంకేను ప్రశ్నించిన పీఎంకే

ప్యారీస్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళ భాషను ముందుంచి రాజకీయం చేస్తున్న డీఎంకే ఇప్పటివరకు ఆ భాష అభివృద్ధి కోసం ఏం చేసిందని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రామదాస్ ప్రశ్నించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... అత్యున్నత్త నోబుల్ బహుమతిని స్వీకరించిన వారిలో 90శాతం మంది మాతృభాషలో చదువుకుని సాధించిన వారేనని, అయితే తమిళనాడులో మాతృభాషను కాపాడుకోవాల్సిన పరిస్థితి రావడం విచారణకరమన్నారు. రాష్ట్రంలో 45శాతం మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని, విద్యను ఉచితంగా అందజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. అయినా గత 58ఏళ్లలో దాదాపు 55వేలకు పైగా ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలిశాయన్నారు. తమిళం తమ ఊపిరి, తమిళం తమ శ్వాస, తమిళం తమ దైవమని ప్రకటిస్తున్న డీఎంకే ఇప్పటివరకు మాతృభాష అభివృద్ధి కోసం ఏమి చేసిందో ప్రజలకు స్పష్టం చేయాలని అన్బుమణి డిమాండ్ చేశారు.

## వీఐటీ వర్సిటీలో ఎంజీఆర్ స్మారకోపన్యాసం



ఎంజీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్సిటీలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ స్మారకోపన్యాసం జరిగింది. కార్యక్రమానికి వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, మాజీ మంత్రులు పొన్నయ్యన్, వి.స్వామినాథన్, కేసీ వీరమణి అగ్ని కృష్ణమూర్తి, ఎస్పార్కే అప్పు పాల్గొని ఎంజీఆర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం ఎంజీఆర్ జీవిత విశేషాల ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అతిథులు, నిర్వాహకులు వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

## మాజీ పాత్రికేయుల సంక్షేమ సంఘ మూడో వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న సంఘ నాయకులు

వేలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ పాత్రికేయుల సంక్షేమ సంఘం మూడో వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం వేళచ్చేరిలోని అమ్మా కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి సంఘం ఉపాధ్యక్షుడు దురై కరుణానిధి అధ్యక్షత వహించగా, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఆర్.చంద్రశేఖర్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యదర్శి ఎస్.పళినియాపిళ్లై వార్షిక నివేదిక ప్రవేశపెట్టగా, కోశాధికారి టీఎస్ జ్ఞానకుమార్ ఆదాయ వ్యయాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జీ.కే.స్టాలిన్, పీ.ఆర్.సుబ్రమణి, పి.నెల్సన్, టి.చొక్కలింగం, ఎం.ఏ.బాలచందర్, ఆర్.మోహనకనకకుమార్, ఎం.నెడుమారన్, జి.మురుగేశన్, మస్తాన్ జగన్, టి.రాజేశ్వరి, ఆర్.సరోజ తదితరులు పాల్గొన్నారు.

తమిళ చిత్రజ్యోతి


శ్రీకాంత్ - పూజిత

## శ్రీకాంత్ - పూజిత జంటగా 'కొంజమ్ కాదల్ కొంజమ్ మోదల్'

శ్రీకాంత్-పూజిత పొన్నాడ జంటగా 'కొంజమ్ కాదల్ కొంజమ్ మోదల్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కింది. కె.రంగరాజ్ దర్శకుడు. వచ్చే నెల 14న విడుదలకానుంది. మై ఇండియా పతాకంపై మై ఇండియా మాణిక్యం తొలిసారి నిర్మించారు. 'ఉన్నై నాన్ సందిత్తేన్', 'ఉదయగీతం', 'ఉయిరే ఉనక్కాగ', 'నినైవే ఒరు సంగీతం' వంటి పలు సిల్వర్ జూబ్లీ చిత్రాలను రూపొందించిన కె.రంగరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించ డంతోపాటు కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చారు. ఇందులో భరతన్,నిమి ఇమ్మాన్యుయేల్ సెకండ్ హీరోహీరోయిన్లుగా నటించారు. భార్గవ్, నంబిరాజన్, కేఆర్ విజయ, ఢిల్లీ గణేష్, సచ్చు, నళిని, పరుత్తివీరన్ సుజాత, సింగం పులి, రమేష్ ఖన్నా, శామ్స్, అనుమోహన్, వినోదిని, కవియరసన్, మాస్టర్ వైష్ణవ్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. నిర్మాత 'మై ఇండియా'మాణిక్యం కీలక పాత్రను పోషించారు. ఈ సినిమా గురించి దర్శకుడు కె.రంగస్వామి మాట్లాడుతూ... 'జీవితంలో డబ్బు ఒక్కటే ముఖ్యం కాదని రెండు విభిన్న కోణాల్లో తెరకెక్కిస్తున్నాం. ఈ సినిమాలో క్లైమాక్స్ సీన్ కోసం రియల్ గ్లైడర్‌ను ఉపయోగించి ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించాం. ఆ సన్నివేశాలు తెరపై చూడటానికి అద్భుతంగా ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల ప్రేక్షకుల చూసి ఆనందించేలా కుటుంబ సమేతంగా దీన్ని రూపొందించాం.చెన్నై, కొడైక్కెనాల్ ప్రాంతాల్లో చిత్రీకరించాం.వచ్చే 14న విడుదల చేస్తున్నాం'అని పేర్కొన్నారు.ఈ చిత్రానికి మాటలు పీఎన్‌సీ కృష్ణ, కెమెరా దామోదరన్ టి, సంగీతం ఆర్‌కే సుందర్, ఎడిటింగ్ కేకే, ఆర్ట్ విజయ్ ఆనంద్, నృత్యం చంద్రూ, స్టంట్ యాక్షన్ ప్రకాష్, నిర్మాత మై ఇండియా మాణిక్య, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కె.రంగరాజ్.

## నమ్మశక్యంగాని కథతో భయపెట్టే చిత్రం 'మర్మర్'


'మర్మర్' ఆడియో విడుదల కార్యక్రమంలో చిత్రబృందం

తనతో పాటు ఎవరూ పెద్దగా నమ్మని కథాంశాన్ని తీసుకుని తెరకెక్కించిన చిత్రమే 'మర్మర్' అని ఆ మూవీ దర్శకుడు హేమ్‌నాథ్ నారాయణన్ అన్నారు. తమిళ చిత్రసీమలో ఫౌండ్ ఫుటేజ్ హర్రర్ మూవీగా తెరకెక్కించారు. ఎస్‌బీకే పిక్చర్స్ పతాకంపై ప్రభాకరన్, స్టాండ్ అలోన్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్మించాయి. వచ్చే నెల 7న విడుదల చేస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని, చిత్రం ఆడియోను తాజాగా విడుదల చేశారు. ఇందులో చిత్ర బృందం సభ్యులంతా పాల్గొన్నారు. నటీనటుల పేర్లను కూడా గోప్యంగానే ఉంచారు. ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు హేమ్‌నాథ్ నారాయణన్ మాట్లాడుతూ... 'నేను చాలా మంది దర్శకులతో కలిసి పనిచేశా. మీడియా సమావేశాల్లో పాల్గొన్నా. మీడియా లేకుంటే రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు ఎవరూ లేరు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు కల్పించేది మీడియానే. ఈ మూవీ ఫౌండ్ ఫుటేజీ హర్రర్ చిత్రం. జవ్వాదు కొండపై ఏడుగురు సన్యాసినులు, మంత్రగత్తె చర్యలను ఏడుగురు యూట్యూబర్లు రికార్డు చేసి ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఆ తర్వాత వారికి ఏమైంది? తిరుగు ప్రయాణంలో వారు ఎలా తప్పిపోతారు? వారి ఆచూకీ కనుగొన్న పోలీసులు.. యూట్యూబర్ల వద్ద ఉన్న పగిలిపోయిన కెమెరాలను స్వాధీనం చేసుకుని, అందులోని ఫుటేజీని ఒక డాక్యుమెంటరీ మూవీగా తెరకెక్కించడమే ఈ సినిమా స్టోరీ. ఈ సినిమా కోసం ప్రతి టెక్నీషియన్ శ్రమించారు. 12 నిమిషాల నిడివితో ఉండే షాట్‌ను సింగిల్ షాట్‌లో తీశారు. లైటింగ్ సరిగాలేని సమయాల్లో మంట వేసి ఆ వెలుగుల్లో చిత్రీకరించాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా తీశాం' అని పేర్కొన్నారు.

## క్రైం ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ జానర్‌లో కృష్ణ 25వ మూవీ


నటుడు కృష్ణ, దర్శకుడు బాలకృష్ణన్ తదితరులు

తమిళ చిత్రపరిశ్రమలో విభిన్నమైన కథాంశాలతో కూడిన చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్న నటుడు కృష్ణ. కోలీవుడ్ దర్శక నిర్మాతలకు నమ్మదగిన హీరోగా గుర్తింపు పొందారు. నిరంతర కృషి, అంకితభావం, సినిమా పట్ల మక్కువతో ముందుకుసాగుతున్నారు. ఆ వరుసలో కృష్ణ తన కెరీర్‌లో 25వ చిత్రంలో నటించనున్నారు. ఈ ప్రాజెక్టును తన పుట్టిన రోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. క్రైం ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందించనున్నారు. 'కేకే25' అనే వర్కింగ్ టైటిల్‌తో మంత్ర క్రియేషన్స్ పతాకంపై నిర్మాతలు మహేంద్రరాజ్, సంతోష్‌కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ ద్వారా వీరిద్దరూ నిర్మాతలుగా మారారు. బాలకృష్ణన్ దర్శకుడు. ఈయన గతంలో 'రెబల్' మూవీకి కో-డైరెక్టరుగా పనిచేశారు. ఏప్రిల్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లి, ఈ యేడాది ఆఖరులో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## ఆ ట్రిక్కులు పనిచేయలేదు శ్రుతిహాసన్


తండ్రి కమల్‌తో...



అగ్రహీరో కమల్ వారసురాలిగా బహిరంగ ప్రదేశాల్లో స్వేచ్ఛగా తిరిగేందుకు తాను ప్రయోగించివిన కొన్ని ట్రిక్కులు ఏమాత్రం ఫలించలేదని హీరోయిన్ శ్రుతిహాసన్ అన్నారు. నటిగా ఇమేజ్ వచ్చిన తర్వాత తాను అబద్ధం చెప్పకముందే వారు తనను గుర్తుపట్టేవారని చెప్పారు. గత యేడాది శ్రుతిహాసన్ నటించిన ఒక్క చిత్రం కూడా విడుదలకాలేదు. కానీ, ఈ యేడాది ఆమె నటించే రజనీకాంత్ 'కూలీ', విజయ్ 'జననాయగన్', విజయ్ సేతుపతి 'ట్రైన్' వంటి భారీ చిత్రాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె సోషల్ మీడియా వేదికగా తన ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. 'అగ్రహీరో వారసురాలిగా, నటిగా గుర్తింపు వచ్చిన తర్వాత ఈ సమస్య మరింతగా ఎక్కువైంది. దీంతో మారు పేర్లతో నన్ను నేను పరిచయం చేసుకునేదాన్ని. అప్పుడు వారు నాతో ఫ్రీగా ముచ్చటించేవారు. కొన్ని సందర్భాల్లో ఆ ట్రిక్కులు కూడా ఫలించేవి కావు' అని పేర్కొన్నారు.

## రామేశ్వరంలో వైభవంగా మహాశివరాత్రి రథోత్సవం


రామనాథస్వామి, పర్వతవర్ధిని అమ్మవారి రథాలను లాగుతున్న భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన రామేశ్వరం రామనాథస్వామి ఆలయంలో మహాశివరాత్రి రథోత్సవాలు బుధవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 18న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రోజూ స్వామిఅమ్మవార్లు వివిధ వాహన సేవల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ ఉత్సవాల్లో 8వ రోజైన మంగళవారం నటరాజస్వామి సప్పరంలో ఊరేగారు.సాయంత్రం స్వర్ణ అశ్వవాహనంలో స్వామిఅమ్మవారు ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగారు. ఈ నేపథ్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయాన్ని వేకువజామునే తెరిచారు. రామనాథస్వామికి, పర్వతవర్ధిని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత స్ఫటికలింగ పూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం9గంటలకు మహాశివరాత్రి రథోత్సవం ప్రారంభమైంది. సర్వాలంకరణ శోభి తులై రామనాథ స్వామి, పర్వతవర్ధిని అమ్మవారు వేర్వేరు రథాల్లో కొలువు దీరి ఊరేగింపుగా బయలుదేరారు. భక్తులు ఇరువైపులా నిలిచి రథాల మోకుతాళ్ళను పట్టుకుని లాగుతూ దారి పొడవునా శివనామస్మరణ చేశారు. ప్రతివీధిలోనూ భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. రథాలు వెళ్లే మార్గంలోని ఇళ్ల ముంగిళ్లలో అందమైన ముగ్గులు వేశారు. పలుచోట్ల భక్తులకు మజ్జిగ, పానకాలను పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత రెండు రథాలు ఆలయ సమీపంలో ఉన్న రథ మంటపాలకు తిరిగొచ్చాయి. ఇక బుధవారం రాత్రి స్వామిఅమ్మవారు వెండి రథంలో ఊరేగారు. గురువారం ఉదయం ఇంద్రవిమానంలో, సాయంత్రం వృషభవాహనంలో స్వామి, అమ్మవారు ఊరేగనున్నారు. ఈనెల 28 రాత్రి భిక్షాటన, మార్చి 1న చండికేశ్వర్లు భక్తులకు దర్శనమిచ్చే కార్యక్రమం జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్న భక్తులకు ఆలయ ట్రస్టీ భారతి, కార్యనిర్వహణాధికారి శివరామ్‌కుమార్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవీంద్రన్, వివిధ భక్త జనసంఘాల నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.


ట్రిప్లికేన్‌లోని తులకానత్తమ్మన్ అమ్మవారి ఆలయం నుంచి పాలాడై అమ్మన్ ఆలయం వరకు 1,008 క్షీర కలశాలతో భక్తుల ఊరేగింపు - క్షీర కలశాల ఊరేగింపులో సొమ్మసిల్లిన మహిళా భక్తురాలు

## మేల్‌మలయనూరు ఆలయంలో మాసి ఉత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం సందర్భంగా సర్వాలంకరణతో అంకాళపరమేశ్వరి అమ్మవారు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరులోని సుప్రసిద్ధ అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శివరాత్రి నుండి 13 రోజులపాటు నిర్వహించే మాసి ఉత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా వినాయక స్వామికి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజారోహణం అత్యంత వైభవంగా వేలాదిమంది భక్తులు, పండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ జరిగింది.అదే సమయంలో వ్రత మాచరించే భక్తులకు కంకణధారణ నిర్వహించారు. శక్తి కరగ (కలశాల) ఊరేగింపు కూడా జరిపారు.ఇక ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన శ్మశానకొల్ల కార్యక్రమం గురువారం జరుగనుంది.

## ఎస్ఆర్ఐహెచ్ఈఆర్‌లో సైన్స్ వారోత్సవాలు


అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అడయార్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (ఎస్ఆర్ఐహెచ్ఈఆర్)లో బుధవారం జాతీయ సైన్స్ వారోత్సవం జరిగింది. ఇందులో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ వారోత్సవాన్ని త్రివేండ్రంలోని పీఐబీ, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ (సౌత్ జోన్) డైరెక్టర్ జనరల్ వి.పళనిస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమాశేఖర్ మాట్లాడుతూ... విద్యార్థులు, అధ్యాపకులు బహుళ విభాగాల్లో పట్టుసాధించాలన్నారు. పరిశోధన కార్యకలాపాల్లో పాలుపంచుకునే వారి సంఖ్యను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఈ కార్యక్రమాన్ని శ్రీ రామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వహించగా, 23 ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన సుమారు 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## హర హర.. మహాదేవ.. శంభో శంకర..

రాష్ట్రవ్యాప్తంగా శివరాత్రి పూజలు


పురుషవాక్కం గంగాదీశ్వర ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం

● రాష్ట్రవ్యాప్తంగా శివరాత్రి పూజలు


జార్జిటౌన్ శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో స్వామిఅమ్మవార్లకు విశేష అలంకరణ

ప్యారీస్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శివాలయాలు హరోంహర.. శంభో శంకర.. దివ్య నామస్మరణతో మార్మోగాయి. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు తమ శరీరాలకు శూలాలు గుచ్చుకుని వివిధ రకాల కావళ్లు మోసుకుంటూ పాదయాత్రగా ఆలయాలకు తరలివెళ్లి మొక్కులు చెల్లించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే మహిళలు పెద్ద సంఖ్యలో పాల కలశాలతో ఊరేగింపుగా వెళ్లి శివలింగాల క్షీరాభిషేకాల్లో పాల్గొని భక్తి తన్మయత్వంలో మునిగితేలారు. కోయంబత్తూరు జిల్లా వెల్లయంగిరి ఈషా యోగా కేంద్రంలో కోలాహలంగా జరుపుకున్న మహాశివరాత్రి వేడుకల్లో కేంద్ర రక్షణశాఖ మంత్రి అమిత్‌షా సహా సినీ కళాకారులు, దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, సంగీత విద్వాంసులు హాజరయ్యారు. స్థానిక ట్రిప్లికేన్ నటేశన్‌రోడ్డులో ఉన్న తుళకానతమ్మన్ ఆలయం నుంచి ఐస్‌హౌస్‌లోని పాలాడై అమ్మవారికి 1008 మంది మహిళలు నెత్తిపై పాల కలశాలు మోసుకుంటూ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్ళారు. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తొమ్మిది శివాలయాల్లో మహాశివరాత్రి పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 5గంటలకు మైలాపూర్ కపాలేశ్వరాలయంలో నిర్వహించిన ప్రారంభోత్సవంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, డీఎంకే ఎంపీ జగద్రక్షగన్, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. జార్జిటౌన్‌లో మూడువందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతి అలంకారంతో వృషభ వాహన సేవలు వైభవంగా నిర్వహించారు. ఎస్కేపీడీ ట్రస్టీలు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.బుధవారం సాయంత్రం 4గంటల నుంచి గురువారం తెల్లవారుజాము 2.45గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, భరతనాట్యం కార్యక్రమాలు కనువిందు చేశాయి. శివయ్య కటాక్షం కోసం పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో శివరాత్రి పూజలకు హాజరైన భక్తులతో ఆలయాలు కళకళలాడాయి.


కన్నియాకుమారిలో విద్యుత్ అలంకరణలో శివపార్వతులు - కాగడాలతో భక్తుల పాదయాత్ర - ఊరేంగిపులో ఒంటికి శూలాలు గుచ్చుకొని వెళ్తున్న భక్తులు

## సమాజంలో వైద్య వృత్తి గొప్పసేవలాంటిది

● మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం టాప్ ● సీఎం స్టాలిన్



అడయార్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సమాజానికి చేసేది గొప్ప సేవ అని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశంసించారు. తమిళనాడు మెడికల్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందించారు. మొత్తం 2,642 మందికి ఈ నియామక పత్రాలను సీఎం అందజేశారు. ప్రాణాలను రక్షించే వైద్యులను ప్రజలు ఉన్నత భావంతో చూస్తారన్నారు. రాష్ట్రం వైద్య సేవల్లో దేశంలో మొదటిస్థానంలో ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చేసి ఫలితమేనన్నారు. జిల్లాల వారీగా వైద్య కాలేజీలు, నగరాల్లో మెరుగైన వైద్య సదుపాయాలతో ఆస్పత్రులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెద్ద నగరాల్లో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, సీఎం ఆరోగ్య బీమా పథకం, 108 అంబులెన్స్ పథకాలను కల్పించామన్నారు. ఒక కుటుంబంలో తొలితరానికి చెందిన పట్టభద్రుడు వైద్య కోర్సును అభ్యసించేందుకు ఎంపికైతే ఆ ఖర్చునంతా ప్రభుత్వమే భరించేలా దివంగత కలైంజర్ ఒక పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇప్పుడు ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసినట్టు చెప్పారు. వైద్యులు ఈ స్థానానికి చేరుకోవడానికి శ్రమించి ఉంటాన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళిచ్చి తంగపాండియన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'సిల్క్ ఇండియా' ప్రదర్శనకు విశేష స్పందన

ప్రదర్శనలో దుస్తులు పరిశీలిస్తున్న వినియోగదారులు



చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేట వైఎంసీఏ మైదానంలో ఏర్పాటైన 'సిల్క్ ఇండియా' ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. దేశంలోని చేనేత కళాకారుల నుంచి నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనలో ఒడిశా సంబల్‌పురి, ఇక్కత్ సిల్క్ చీరలు, బీహార్ ఆర్గానిక్ టస్సర్, సూట్ మరియు స్టోల్స్, అసోం ముగా మరియు ఏరి సిల్క్ చీరలు, కర్ణాటక క్రేప్ సిల్క్, జార్జెట్, ఆరణి సిల్క్, ప్రింటెడ్ చీరలు, కాంచీపురం సిల్క్, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి, మల్బారి సిల్క్, జమావర్ సిల్క్, చిఫాన్ సిల్క్, మహారాష్ట్ర డిజైనర్ డ్రెస్ మెటీరియల్స్, ఛత్తీస్‌గఢ్ రా సిల్క్ చీరలు, కోసా సిల్క్ టస్సర్ దుపట్టా తదితరాలన్నీ అందుబాటులో వున్నాయి. మార్చి 2వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను సందర్శకులు ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు.